కొనసాగుతున్న వారాహిదేవి ఉత్సవాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత దైవసన్నిధానంలో శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ మహా వారాహి (ఇంద్రాణి దేవి) దేవికి మూల మంత్ర హోమాలు, అభిషేకాలు, మహా పూర్ణాహుతి, ఆదివారాహి మహాపూజ, ఉద్యాపన పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

4న కుంకుమార్చన

ఆల్విన్‌కాలనీ: ఆషాఢమాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబ దేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన జరుగుతుందన్నారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం కూరగాయలు అందజేసేవారు ఒక రోజు ముందు గురువారం మధ్యాహ్నం వరకు ఆలయంలో అందజేయాలని సూచించారు. శుక్రవారం అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో ప్రసాదంను శనివారం ఆలయంలో పంపిణీ చేస్తామన్నారు.

ఇంద్రహిల్స్ కాలనీలో త్వరలో సీసీ రోడ్డు



వరద నీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో రోడ్డు పైన వరదనీరు చేరి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బుధవారం సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు మంజూరైందని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, వెంకట్‌నాయక్, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, నరసింహులు, సిద్దయ్య, సత్యనారాయణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఎన్‌టీఆర్ నగర్‌లో నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులను బుధవారం బీఆర్‌యస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో మల్లేష్, నాగరాజు, రామకృష్ణ, శివ, ఉమేష్, రాజు, మహేష్, కలిమ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 148వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో బుధవారం స్థానిక మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దుచేసేవరకు తమ పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 50 , బెండ 60, కాకర 60, దొండ 45, దోస 40, ఆలు 30, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 100, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

ఉద్యోగుల కాలనీ.. అన్నీ సమస్యలే..

ఇదీ రంగారెడ్డిజిల్లా టీఎన్‌జీఓ కాలనీ దుస్థితి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, అమలు చేసే సంక్షేమ పథకాలు విజయవంతం చేయడంలో ముఖ్యభూమిక పోషించే ప్రభుత్వ ఉద్యోగులు నివాసముండే కాలనీలో సమస్యలు నెలకొన్నాయి. రంగారెడ్డిజిల్లా పరిధిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు నివాసం ఉండే టీఎన్‌జీ కాలనీ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాన్ని ఆనుకునే ఉంటుంది. రంగారెడ్డి జిల్లా ఉద్యోగులంతా ఒకచోట ఉండేలా వారికి ఇళ్ల స్థలాలు కేటాయించగా ఇప్పటి వరకు 500 ఇళ్ళు కట్టుకున్నారు. కాలనీ సమస్యలు తీర్చాలని కాలనీ సంక్షేమ సంఘం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించగా కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. కాలనీలోని ప్రధాన, అంతర్గతరోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, చెరువు సుందరీకరణ, వీధిదీపాలు, పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు ఇవే..

- కాలనీలో పలుచోట్ల ప్రధాన, అంతర్గత రోడ్లపై



ముష్కి చెరువు కట్ట



టీఎన్‌జీఓకాలనీ రంగారెడ్డిజిల్లా ప్రాంతంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

డ్రైనేజీ పారుతోంది. వాహనాలు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

- ప్రధాన రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్ల విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదు
- కాలనీకి చేరువలోనే సెక్షన్ ఆఫీస్ ఉన్నా, కాలనీలో నీటి సమస్య నెలకొంది. కాలనీలో రోజు రోజుకూ ఇళ్ల సంఖ్య పెరిగిపోతుండడంతో మంచి నీటి కనెక్షన్ల సంఖ్య పెరుగుతూ పోతోంది. దీంతో సరిపడా నీటి సరఫరా జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- టీఎన్‌జీ కాలనీలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు పనిచేయడం లేదు. అందరూ



గుంతలమయంగా రోడ్డు

నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి

- కాలనీ చెంతనే రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మించి 8 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు.
- కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు జూన్ 2023లో మొదలు పెట్టారు. రెండేళ్ళు గడుస్తున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు.
- కాలనీలో ఉండే ముష్కి చెరువు సుందరీకరణ చేపట్ట లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీని ఆదర్శంగా మార్చాలన్నదే లక్ష్యం



టీఎన్‌జీఓకాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వెల్ఫేర్ సొసైటీ పనిచేస్తోంది. పూర్తి స్థాయి మౌలిక వసతులు దశలవారీగా కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాలనీలో 500 ఇళ్లు ఉన్నాయి. నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– జంగయ్య, రంగారెడ్డిజిల్లా
టీఎన్‌జీఓస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

వసతులు లేక ఇబ్బందులు



కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయి మౌలిక వసతులు లేవు. చెరువు సుందరీకరణ, డ్రైనేజీ, మంచినీటి సరఫరా ఇలా ఇక్కట్లు పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసినవారే ఇక్కడ నివాసముంటున్నారు. వారికి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– జోసఫ్, రంగారెడ్డిజిల్లా
టీఎన్‌జీఓస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి

ఆస్పత్రిలో కార్మికులను పరామర్శించిన ఎమ్మెల్యే



చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో మదీనాగూడలోని ప్రణామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే గాంధీ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పటల్ ఎండీ డాక్టర్ మనీష్‌గౌర్‌ను బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఎంబీసీ చైర్మన్, జేరిపేటి జైపాల్, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా..



రాయదుర్గం: అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు నడుద్దామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ళ ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. జూలై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో నాయకులు రాధనోళ్ళ వేణు అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పీడిత వర్గాలను ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ అధ్యక్షుడు ఉమేష్ అంబేద్కర్, ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు మనోజ్, శ్రీకాంత్, బిరోన్, అజయ్, ఆనంద్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళా కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి కుట్టు శిక్షణా కేంద్రాన్ని కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మహిళల కోసం సీఎం రేవంత్‌రెడ్డి మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వీణ, సీనియర్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

6న ‘టీటా’ బోనాల జాతర

రాయదుర్గం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీఐటీఏ) ఆధ్వర్యంలో ‘టీటా బోనాల జాతర-2025’ను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు టీటా వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల బుధవారం తెలిపారు. ప్రతియేటా బోనాల జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా జూలై 6వ తేదీ ఉదయం 9 గంటలకు మాదాపూర్‌లోని శిల్పారామం నుంచి జాతర మొదలై చిన్న పెద్దమ్మ దేవాలయం వరకు సాగుతుందన్నారు. ఈ ఉత్సవాలలో ఐటీ ఉద్యోగులు బోనం ఎత్తి అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు, ఒగ్గుడోలు, ఆదివాసీ కొమ్ముకోయచ, గుస్సాడి నృత్యాలు ఇలా వివిధ కళారూపాల ప్రదర్శన ఉంటుందన్నారు.

గణేష్‌గడ్డ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో హుండీని బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ లావణ్య సమక్షంలో లెక్కించారు. 105 రోజులకు గాను రూ.28 లక్షల 17 వేలు వచ్చినట్లు ఈఓ లావణ్య , జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అన్నదానం హుండీ ఆదాయం కూడా లక్ష ఇరవై వేలు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



చందానగర్: మహిళ అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఉన్న మలాబార్ గ్రాండ్‌మా హోమ్ (దయా రిహాబిలిటేషన్ ట్రస్ట్) సామాజిక సంక్షేమ అధికారి కెఆర్. శాలినీ, మేడ్చల్ కరుణాారాదరం చారిటబుల్ ట్రస్ట్‌లో ఉన్న మేరుగు విద్య (30)ను ఈ నెల 1వ తేదీ చందానగర్‌లోని మలాబార్ గ్రాండ్ మా హోమ్‌కు తీసుకువచ్చారు. ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోంది. మంగళవారం రాత్రి 10.40 గంటలకు హోమ్ నుంచి పారిపోయింది. చుట్టు పక్కల ప్రదేశాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె అడుగుల ఎత్తు, తెల్ల స్వెటర్, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలదని వారు పోలీసులకు వివరించారు.


దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నిజాంపేట్: పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి ఇచ్చే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద జులై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. దేశమంతటా పూర్తి స్థాయిలో లేబర్ కోడ్స్ అమలులోకి రాకముందే జమ్మూకశ్మీర్‌లో 420 యూనియన్ల రిజిస్ట్రేషన్‌లను ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటల పని దినంగా నిర్ణయించిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో లేబర్ కోడ్స్ సాకుతో కార్మిక సంఘాల, కార్మికుల హక్కులు హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని బానిసలుగా కేంద్ర ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నయ్య, సత్యనారాయణ, నాగేషు, నరసింహ, బాలస్వామి, నరసింగరావు, రమేష్, మనీ, లక్ష్మి, యాదమ్మ, వెంకటమ్మ, బుజ్జమ్మ, అలివేలు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లోని సరస్వతి పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ ఎంటమాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. చెత్తా చెదారం నిల్వ ఉంచకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వలు ఉంచుకోకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బంది తర చు ఫాగింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌గౌడ్, ఎంటమాలజీ ఈఎస్ ఏపీ ఉదయ్ కుమార్, సిబ్బంది ఎం. రాజు, శ్రీను, కృష్ణ, సుభాష్, స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. ఆంజనేయలు, నాయకులు ఎస్. నవీన్‌కుమార్, ఇందిర, సరస్వతి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

వర్షాకాలం విపత్తులు సంభవిస్తే సంప్రదించాల్సిన నంబర్లు

చందానగర్ : వర్షాకాలంలో విపత్తులు (వరద ముంపు, రోడ్లపై వర్షపు నీరు నిలిస్తే, విద్యుత్ సరఫరాలో అంతరాయం, చెట్లు విరిగి పడ్డా, రోడ్డుపై గుంతలు ఏర్పడ్డా, ట్రాఫిక్ సమస్య)వచ్చిన వెంటనే ప్రత్యేక టీంలను సంప్రదించవచ్చు. చందానగర్ సర్కిల్ 21లో ప్రత్యేక టీంల వివరాలు...

శేరిలింగంపల్లి జోన్ కమిషనర్ – భోర్కడే హేమంత్ సహదేవ్‌రావు :	9154931424
చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్– మోహన్‌రెడ్డి :	9000420691
సూపరింటెండెంట్ ఇంజనీర్– శంకర్ :	8978026758
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ – ఇందిరాబాయ్ :	963025505
చందానగర్ డీఆర్‌ఎఫ్ టీమ్– 48 :	8712406829
వి.వెంకటేశ్వర్లు (మార్షల్) :	7606833322
బి.చరణ్ (ఎస్‌ఎఫ్‌ఓ) :	8712407181
ఏ.జయప్రకాష్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ :	9949991088

మియాపూర్ పోలీసు అధికారుల నంబర్లు

మియాపూర్ సీఐ క్రాంతి కుమార్	-9490617129
క్రైమ్ డీఐ రమేష్‌నాయుడు–	8331013218
క్రైమ్ ఎస్ఐ నర్సింహారెడ్డి –	8712568331
ఎస్ఐ చంద్రయ్య –	8712568233
ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి –	8712568213
ఎస్ఐ వెంకటేశ్వర్లు –	8712568310
ఎస్ఐ మాణిక్యం –	8712568151
ఎస్ఐ కృష్ణ –	8712567047
ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి–	8712568116
పెట్రోల్ మొబైల్–	8333993414,8333993415

రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి

చందానగర్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మెదక్ జిల్లా టెక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎల్లంపల్లి నవీన్ (30) భార్య భవానీతో కలిసి కొండాపూర్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 1వ తేదీ ఉదయం స్వగ్రామానికి వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 8.00 గంటలకు పటాన్‌చెరు వచ్చానని ఇంటికి వస్తున్నానని భార్యకు ఫోన్ చేశాడు. కాసేపటికి భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బుధవారం ఉదయం నవీన్ సెల్‌ఫోన్ నుంచి ఆమె ఫోన్ వచ్చింది. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు వస్తుండగా డోయన్స్ కాలనీ ముఫ్తీ క్లాత్ షోరూమ్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. తీవ్ర గాయాలై మృతి చెందాడు. సమాచారం అందుకున్న చందానగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతి చెందాడని ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకోం



నడిగడ్డతండాలో కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

మియాపూర్: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదల నివాస స్థలాలను పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నాలను మానుకోవాలని ఎంసీపీఐయూ మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ అన్నారు. మియాపూర్‌లోని నడిగడ్డతండా, ఓంకార్‌నగర్, ఎంఏనగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, హౌసింగ్ బోర్డు అధికారులు బుధవారం పర్యటించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తామని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. దీనికి నడిగడ్డతండా, ఓంకార్‌నగర్, ఎంఏనగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదలు నివసిస్తున్న స్థలాల్లోనే ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. పేదల ఇళ్ల జోలికి వస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఎంసీపీఐయూ మియాపూర్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ హెచ్చరించారు.

హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల సేవలు షురూ..

- ఒక్కో డివిజన్‌కు ఒక ఎమర్జెన్సీ టీమ్
- మూడు షిఫ్టుల్లో పనిచేయనున్న సిబ్బంది





సోమాజిగూడ ప్రజాభవన్ వద్ద వాటర్ లాగింగ్ పాయింట్‌లో హైడ్రా మాన్సూన్ టీమ్‌లు

బంజారాహిల్స్: వర్షాకాలంలో వరదనీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్, కాలువల్లోకి వరదనీరు పోయేలా చర్యలు తీసుకోవడానికి హైడ్రా పూర్తిస్థాయి సన్నద్ధమైంది. ఈ మేరకు ఒక్కో డివిజన్‌కు ఒక మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ను నియమించింది. ఖైరతాబాద్, జూబ్లీ హిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లకు ఒక్కో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ను నియమించింది. మంగళవారం రాత్రి నుంచే ఈ బృందాలు రంగంలోకి దిగి వరదనీరు నిలిచే ప్రాంతాల్లో సేవలు అందించాయి. మోకాలులోతు వరదనీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయా టీమ్‌లు వాటర్ లాగింగ్ పాయింట్లను క్లియర్ చేశాయి.

- ఒక్కో టీమ్‌లో నలుగురు సిబ్బంది ఉండగా.. మూడు షిఫ్టుల్లో ఈ టీమ్‌లు పనిచేస్తాయి.
- ఒక్కో డివిజన్‌కు 12 మంది సిబ్బంది ఉంటారు.
- భారీగా వరదనీరు నిలిచే చోట మోటార్ల సహాయంతో నీటిని తోడేందుకు పెద్ద పెద్ద పంపుసెట్లను బృందాలకు అందజేశారు.
- వర్షపునీరు నిలిచే చోట స్టాటిక్ టీమ్‌లు రెండు షిఫ్టుల్లో పనిచేసేలా మరి కొంతమంది సిబ్బందిని నియమించారు.
- వీరికి తోడు ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీ హిల్స్ సర్కిల్–18, యూసుఫ్‌గూడ సర్కిల్–19లో ఉన్న ఏడు హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు చర్యల్లో నిమగ్నమయ్యాయి.
- ఒక్కో టీమ్‌లో 18 మంది ఉండగా.. డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా 100 మందికి పైగా సేవలు అందిస్తున్నారు.
- వీరు ఒక్కో షిఫ్టులో ఆరుగురు చొప్పున పనిచేస్తారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఎమర్జెన్సీ బైక్ బృందాలు నాలుగు ఉన్నాయి.
- ఒక్కో బైక్‌పై ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు.
- ఒక్కో సర్కిల్‌లో పనులను పర్యవేక్షించేందుకు హైడ్రాకు చెందిన మార్షల్స్ ముగ్గురిని నియమించారు.
- ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో కలిసి పనిచేసేందుకు రెండు షిఫ్టుల్లో మరిన్ని బృందాలు ఏర్పాటుచేశారు.
- చెట్ల కొమ్మలు, చెత్తను ఎత్తేందుకు వీలుగా ఒక్కో షిఫ్టులో ముగ్గురు చొప్పున ఉండేలా సిబ్బందిని నియమించారు. ఎప్పటికప్పుడు నాలాలు, కల్వర్టులను పరిశీలించి వరదనీటి ప్రవాహం సాఫీగా సాగేలా ఈ టీమ్‌లు పనిచేయనున్నాయి.
- వరదనీరు నిలిచిన వెంటనే తోడేందుకు మోటార్ పంపులు, చెట్లు పడిపోతే తొలగించడానికి కటింగ్ మిషన్లు, చెత్తను తొలగించడానికి అవసరమైన పరికరాలను డీఆర్‌ఎఫ్ బృందాలకు అప్పగించారు.